


# మనసారం

**విహారి**

"నా పేరు వైతరణి మేమ్. టూ మినిట్స్ మీతో మాట్లాడవచ్చా?''

"చెప్పండి'' వినత లోలోపల విసుగు (వైతరణి! ఇదెక్కడి పేరురా నాయనా!)

"దేశాంతర క్లబ్ నుంచీ మాట్లాడుతున్నాను. మా క్లబ్‌లో మెంబర్‌షిప్ తీసుకుంటే...''

"వద్దు. అక్కడ ఆగిపో తల్లీ వై..త..ర..ణీ! నాకు ఇంట్రెస్ట్ లేదు'' (కడదాక ఈదటం నావల్ల కాదు!) ఫోన్ కట్ చేసింది. హ్యాండ్‌బ్యాగ్ సర్దుకుని వెళ్లి డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది. తల్లి కాంతమ్మ టిఫిన్ పెట్టింది. తినసాగింది వినత. త్వరగా వెళ్లాలి... ఇవ్వాళ తొమ్మిది గంటలకి ఒక పెద్ద కేస్ అపాయింట్‌మెంట్. మనసునిండా ఆలోచనలు. తానాశించినట్లు పార్టీ పాలసీ తీసుకుంటే, హెచ్చు మొత్తంలోనే వస్తుంది కమీషన్. అదీ ఆశ, ఇది ప్రయత్నం... జూబ్లీహిల్స్ దాకాపోవాలి... ఎనిమిదై పోయింది... ఒకవేళ ఆయన చివరికి 'నా కొద్దులే అమ్మా'' అంటే?..

ఆలోచనల ట్రాఫిక్‌జామ్. వినతకి చిరాకేసింది. ''కాఫీ ఇవ్వమ్మా'' మాటల్లో త్వర, పలుకులో విసుగు. మనసులో అసందిగ్ధత మీద చిరాకు.

''మరీ ఎక్స్‌ప్రెస్ తిండి తినకే తల్లీ...ముక్కునా నోటనా కొట్టుకుంటున్నావ్. కానీ, ఇదిగో కాఫీ'' కాంతమ్మ కప్పుని టేబుల్ మీద ఉంచి, సాసర్ మూత పెట్టింది.

వినత ఏమీ అనలేదు. ఇబ్బందిగా మొహం పెట్టింది. కాంతమ్మ తమ బతుకు పుస్తకాల్ని బాగానే చదివింది, కూతుర్ని అంతకంటే బాగానే చదివింది. పరిస్థితి తెలుసు. వినత హడావిడీ తెలుసు. స్టూల్ లాక్కుని కూర్చుంది.

సెల్ మోగింది. చూసింది వినత. అటునుంచీ వైతరణీ!

వినతకి చిరాకేసింది. ''వై..?'' అని సాగదీసి, స్వరం పెంచి ''త..ర..ణీ.., నన్నొదిలెయ్ తల్లీ. నేనూ...'' అని ఏదో అనబోయి తమాయించుకుంది.

''సారీ మేమ్. ఏదో పర్స్యూ చేస్తే...'' అని నాన్చింది వైతరణి. అక్కర్లేంది పర్స్యూ చేస్తే కొరివితో తల గోక్కుంటారా అవతలివాళ్లు'' కొంచెం పెద్ద రికపు గొంతుతో గద్దించింది.

వైతరణి ఏమనుకుందో ఏమో ఫోన్ కట్ చేసింది.

''అమ్మయ్య'', అనుకుని ప్లేట్‌లోనే మునివేళ్లని కడిగేసి, కాఫీ అందుకుంది వినత. తల్లివైపు చూసింది. ''ఎవరో వైతరణిట. దేశాంతర క్లబ్ మెంబర్‌షిప్‌కి మార్కెటింగ్. చిత్రంగా వుంది పేరు. అయినా అడుక్కుతినే వాడి దగ్గర గీరుకు తినే వాడన్నట్టు నాదే బెగ్గింగ్. మళ్లీ ఈ పిల్లొకతి!'' అని నవ్వింది.

కాంతమ్మకీ నవ్వొచ్చింది. సన్నగా నవ్వుతూ, ''ఎవరి ఏడుపు వారిదీ. పీత కష్టాలు పీతవి! నువ్వు ఇన్సూరెన్స్‌లో వున్నావని ఆ పిల్లకేం తెలుస్తుంది పాపం...'' అన్నది.

''అవునవును'' అని తల్లి వైపు మెచ్చుకోలుగా చూస్తూ ''నేవస్తా'' అంటూ బ్యాగ్ తీసుకుని బయట తన కైనెటిక్‌హోండా కేసి నడిచింది.

దారిలో...బుర్రనిండా ఆలోచనల మిశ్రమాన్ని తయారు చేస్తోంది. (ఎక్కడో పట్టి ఉంటారు పేర్ల లిస్ట్‌ని. సేల్స్‌మేనేజర్ చెప్పాడు. రెండువేల నెంబర్లు రెండువేల రూపాయలని. నిన్న అంజలి చెప్తోంది. తమ మేనేజరు వెయ్యికే సంపాదించాడని. సప్లై ఎక్కువైతే రేటు పడిపోతుందిగా! ఐదేళ్ల క్రిందటి ఎకనామిక్స్...కొంచెం కొంచెం మిగిలివుంది.)

నవ్వుకుంది. పంజాగుట్ట సెంటర్లో ట్రాఫిక్‌జామ్. టైమ్ చూసుకుంది. ఎనిమిదీ ముప్పై అయిదు. (కదిలింది... కదిలింది...లక్కీ...శుభసూచన! మన సంతా పాలసీ మీద వుంది. ఏం అడుగుతాడో ఆయన? ఎలా కన్విన్స్ చేయాల్సొస్తుందో?) ఎవరో అడ్డం వచ్చారు. తడబాటుని ఆపుకుని, బండినీ బ్యాలెన్స్ చేసింది. బండి సాగుతోంది మళ్లీ.

సెల్ మోత...విసుగు, చిరాకు, టైమ్ సమస్య. అయినా, బండిని పక్కకి తీసుకుని ఆగింది.

''హలో''

''సారీ మేమ్. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నాను''

''చెప్పండి''(చేసి చచ్చావుగా, ఏడ్చావు!)

''నేను కా.కా. కంపెనీ నుంచీ మాట్లాడుతున్నాను. నా పేరు సౌపర్ణి మేమ్. మా కంపెనీ ఒక మంచి ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ని ప్రవేశ పెట్టింది''

ఠక్కున ఫోన్‌ని ఆపేసి, బండిని రోడ్డెక్కించింది. (ప్రతివాడూ మార్కెటింగే. హైదరాబాదంతా మార్కెటింగ్ మీదే బతుకుతోంది. ఛస్తున్నారు జనం. సేల్స్ మేనేజర్ చెప్తున్నాడు. ఈ టెలీ మార్కెటింగ్‌లో సక్సెస్ రేటు పాయింట్ సిక్స్ పర్సెంట్‌ట. ఎవరో ఎస్ఎంఎస్ సర్వే చేసి డబ్బు గుంజుకుని మరీ చెపాట్ట! చిత్రమైన సన్నివేశం!)

మళ్లీ ఫోన్ మ్రోగింది.

ఈసారి కోపమొచ్చింది. (మొహం దానంతటది వికారపు గీతలు గీసుకుంది. తను చూసుకోలేని పరిస్థితి!)

మ్రోగనీ...మ్రోగనీ... వదిలేసింది. చూడలేదు.

ఆగిపోయింది (ఆగిపోక ఛస్తుందా!) అహఁహఁ మళ్లీ మ్రోగింది. (ఆ సౌ..ప..ర్ణే అయివుంటాడు. జిడ్డుగాడు) చూళ్లేదు. స్పీడ్ పెంచింది. (అయినా సౌపర్ణి ఏమిటో అరె...అతను సౌపర్ణి...తాను వినత.. ఓరినీ. బంధుత్వం కలిసిందే! అందునా... తల్లిని చేసేసే బంధుత్వం.. ఓరి బాబోయ్.. బిడ్డా ...వద్దు లేరా... నువ్వక్కడే ఉండరా తండ్రీ...)

చెక్‌పోస్ట్ వచ్చేసింది. టైమ్ చూసుకుంది వినత. ఎనిమిదీ ఏభై. జర్నలిస్ట్ కాలనీ... నో ప్రాబ్లెమ్... ఇక్కడే చేరుకోవచ్చు. వెళ్తోంది. సీతారామారావ్– అదే తాను కలుసుకోబోయే పార్టీ.. ప్రొఫైల్ మననం చేసుకోసాగింది.

సీతారామారావ్ ఇక్కడ బిటెక్ చేసి, యూఎస్‌లో ఎంఎస్ చేశాడు. నాలుగేళ్లండి తిరిగి మన దేశం వచ్చేశాడు. పెళ్లయింది. ఒక పిల్ల పేరు శృతి. రెండేళ్లు. ఇక్కడొక ఎంఎన్‌సీలో ఉపాధ్యక్షుడు! భార్య రత్న. ఆమె కూడా అతనిలాగానే సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. వేరే కంపెనీలో చేస్తోంది.

వీళ్లిద్దరికీ, పిల్లకీ ఉపయోగపడేటట్టు– విడివిడిగానూ, కలిపీ ఏఏ పాలసీలు ప్రతిపాదించవచ్చో మంచి హోమ్ వర్క్ చేసి సిద్ధంగా వుంది వినత.

–ఇల్లు కనుక్కుంది. స్కూటర్ ఆపి, దిగింది. బండిని పార్క్ చేసి లోపలికి వెళ్లింది.

వినతకి ఉద్వేగంగా వుంది. బయటి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. పెద్ద బంగళా. టెన్నిస్‌కోర్ట్‌లా లో వాకిలి. గార్డెన్. పక్కగా ఎత్తైనకొండ. చెట్లు. (భోగులు వేరు, యోగులు వేరు, రోగులు వేరు అని ఏవో కథలు చెప్తూ వుండేది అమ్మమ్మ; ప్రపంచంలోని సౌఖ్యాల్ని గురించి) ఠక్కున ''ఛా'' అనుకుని తల విదిలించుకుంది.

అవన్నీ గుర్తుచేసుకుని మనసు పాడు చేసుకోదలచుకోలేదు వినత.

ముందుకు... మునుముందుకు కదిలింది.

బెల్.. తలుపు తెరుచుకుంది. ''రండి'' ఆహ్వానం. (రత్నే అయివుంటుంది) పరిచయాలు.. పరామర్శలు. ప్లెజంట్రీస్ కలబోత. కాఫీ. (ఎవరో పెద్దావిడ


*With Best Compliments From*

**Ph: 23079802**

**UNIVERSAL TRADING CORPORATION**

89, Panchaseela Colony,
Opp. Pragathi School,
IDA Gandhi Nagar,
Hyderabad - 500 037

Dealers in : Industrial Oils & Greases and
General Order Suppliers

ఇచ్చింది. వంటమనిషి కాబోలు. ఇన్సూరెన్స్‌కి పని కొస్తుందా! ఏజ్ ప్రూఫ్ ప్రాబ్లెం రావచ్చు. ఛ... బుద్ధి...ఆలోచనంతా ప్రాస్పెక్టింగ్ మీదే!)

''యస్ మిస్టర్ రావ్''. ఎలర్ట్ అయింది వినత. రత్న లేచి లోపలికెళ్లింది. వెళ్తూ వెళ్తూ ''మీరు డిస్కస్ చేయండి. వస్తా'' అంది. ''యా.. నువ్ శృతిని చూడు'' అని వినతకేసి చూశాడు రావ్. సోఫాలో సర్దుకుని కూచున్నాడు ''మీకు రింగ్ చేశాను. రెండుసార్లు ట్రై చేశాను. మీరు డ్రైవింగ్‌లో ఉండివుంటారు''

''సారీ.. అవును. ట్రాఫిక్ హెవీగా వుంది''. నొచ్చుకుంది.(దారిలో మ్రోగింది వీళ్ల కాల్ అన్న మాట. ఆ సొపర్ణిగాడనుకుని చూళ్లేదు. అప్పుడప్పుడూ బుద్ధికి ఇలాగే తిక్కపుడుతుంది. జాగ్రత్తగా వుండాలి. ఇట్టాంటి మిస్టేక్స్‌కి తావివ్వకూడదు).

''పేపర్సన్నీ తెచ్చారు కదా. బెనిఫిట్ ఇలస్ట్రేషన్స్ కూడా'' అడిగాడు రావ్.

''యస్ సర్. బ్యాగ్‌లోంచీ తీసి టీపాయ్ మీద ఉంచింది. చేతిలోనే కొన్ని కాగితాలు'' తీసుకుని తిరగేశాడు రావ్. అతని మనస్సక్కడలేదనిపించింది వినతకి. చాలా కేజువల్‌గా తిప్పుతున్నాడు కాగితాల్ని.

''ఒక పని చేయండి. పేపర్సన్నీ ఇక్కడిచ్చి వెళ్లండి. వివరంగా చూసి మీకు మళ్లీ ఫోన్ చేస్తాను. సారీ.'' అని వో క్షణం ఆగాడు. అంతలోనే అన్నాడు,'' మా శృతికి రాత్రి నుంచీ ఫీవర్. డాక్టర్ అపాయింట్‌మెంట్ వుంది. వెళ్లాలి. నిజానికి మిమ్మల్ని రావద్దని చెప్పాలనే ఫోన్ ట్రై చేశాను'' అన్నాడు. లేచి నిలబడ్డాడు.

''సారీ సర్.'' అంటూ తానూ నిలబడింది వినత. బ్యాగ్ సర్దుకుంది. అప్పటికే అతను పక్క గదివైపు రెండు సార్లు చూడటం గమనించింది వినత. ''నేవస్తా మరి. మేమ్‌కి చెప్పండి'' అంటూ బయటికి కదిలింది.

స్కూటర్ వెళ్తోంది.

తనమీద తనకి కోపం ముంచుకొచ్చింది వినతకి. (ఫోన్ చూసి వుంటే బాగుండేది. అప్పుడు సారీ చెప్పి ఆగిపోవటం వేరు; ఇప్పుడు చెప్పటం వేరు. ఇంప్రెషన్ వేరుగా ఉంటుంది. ఛీ...తనకి బుద్ధిలేదు. కాదు ఆ సొపర్ణిగాడు దాపురించాడు. అసలీ ఉదయం బాగాలేదు. వై? వై.త..ర...ణి... తోనే మొదలు..)

(అసలు జీవిత బీమా అంటేనే ఒడిదుడుకులూ, ఎత్తు పల్లాలూ. ప్రపంచంలో ఏజంట్లందరికీ ఇవే అవస్థలు. అందులోనూ ఇండియాలో తమ బ్రతుకిలా తగలడింది!)

ఎక్కడికి వెళ్తోందో అర్థం కాలేదు క్షణంలో సగంసేపు ఆలోచనలోనూ, రోడ్ మీద కూడా.

స్పృహలో కొచ్చింది. ఆఫీస్‌కి దారితీసింది. ఆఫీస్ కొచ్చింది. బ్యాగ్‌ని టేబుల్ మీద పడేసి బాత్‌రూమ్‌కి వెళ్లి ఫ్రెష్ అయివచ్చి కూర్చుంది. టైమ్ పదిన్నర.

సేల్స్ మేనేజర్ వచ్చాడు. శుభోదయం చెప్పింది. (నా మొహం. గుడ్ మార్నింగ్ కాదిది బ్యాడ్ మార్నింగ్. ఈయనొకడు. తనకెక్కడ సందేహమో ఆయనకక్కడ అనుమానం. మనిషి మాత్రం టక్కునిక్కూ అంతా హై ప్రొఫైల్. ఏమిటో నిరుత్సాహంగా వుంది. అమ్మనీ, చెల్లెల్నీ పోషించటానికి ఈ అవస్థలు. ఈ ప్రొఫెషన్‌లో లక్షలార్జించవచ్చని దిగింది. రెండేళ్లయింది. తిరిగి చూసుకుంటే నిండా నెలకి ఐదువేలు కూడా దక్కినట్లు లేదు. ఏదైనా డెస్క్‌వర్క్ చూసుకుంటే బెటర్. ఆలోచించాలి.)

ఆలోచిస్తుండగానే ఎస్ఎం పిలిచాడు. వెళ్లి కూచుంది వినత. ''కాఫీ...?'' అడిగాడు. వద్దన్నది.

''బ్యాడ్ న్యూస్ వినతగారూ... చూడండి''. అంటూ కాగితమిచ్చాడు.

ఉద్విగ్నమైన మనస్సుతో చదివింది. తాను ఇంతకు ముందు చేయించిన పాలసీదారుల్లో ఎవరో మరణించారు. ఎర్లీ డెత్ క్లెయిమ్.

''ఆందోళన పడకండి. ఎవరో ఏమిటో చూడండి. ఇన్వెస్టిగేషన్‌కి ఇచ్చారు కదా. చూద్దాం ఏం తేలుతుందో'' అన్నాడు.

వినతకి గుండెల్లో రాయిపడింది.

''యాక్సిడెంట్ లాంటిది కాదు. గతంలో ఏమైనా జబ్బులుండి చెప్పకుంటే కదా సమస్య. చూద్దాం కానీండి'' అన్నాడు.

సెల్ మ్రోగింది. తీసి చూసింది వినత.

అటువైపు నుంచీ చెల్లెలు. ''ఉన్నట్టుంది కళ్లు తిరిగిపడిపోయింది అమ్మ. నువ్ వెంటనే వచ్చెయ్''

గుండెలవిసినై వినతకి. ఎస్ఎంకి చెప్తుంటేనే మాటలు తడబడినై. కాళ్లల్లో నీరసం ఆవహించింది. కంగారుగా బయల్దేరి బయటపడింది.

లిఫ్ట్‌లోంచీ బయటికొస్తుండగా తక్కున స్ఫురించింది. తాను తల్లి పేరునా పాలసీ తీసింది. ఆమె బీ.పీ. మనిషి. ఖర్మం చాలక ఆమెకి ఏమైనా జరిగితే?!

కైనెటిక్ హోండా స్టార్ట్ చేస్తుంటే అసంకల్పంగా దృష్టి చేతిమీద పడింది. అరచేతికంతా ఏదో మకిలి!!!

★

# వెలుతురు పిట్ట

**- నన్నపనేని రవి**

మా అరుపులనీ అపశబ్దాలనీ నివారించిన
ఈ సుస్వరమెక్కడిదీ
ఏ వంత వనాలదీ –
మా కొకరికి అమ్మతనం మరొకరికి నాన్నతనం
ప్రకటించిన
ఈ సౌందర్యమెక్కడిదీ
ఏ ప్రభాత సంధ్యలదీ –
మా మనసులు పులకరించాయి...
ఊగే ఉయ్యాల్లోంచి లాలించే చేతుల్లోకి
లాలించే చేతుల్లోంచి ఊగే ఉయ్యాల్లోకి
అటు మారుతూ ఇటు మారుతూ
మా ఓర్పునీ నేర్పునీ మా అందరి సహనాలనీ
ఎంత బాగా పరీక్షిస్తున్నావే మా బుజ్జి బంగారు
కొండ !

చక్రాల్లా దిప్పే ఆ కన్నుల్లో వెన్నెల ఏ నిండు
చందమామదీ
సన్నని పెదాల మీద కదిలాడే ఆ కాంతిరేఖ ఏ
నింగి తారలదీ
కాసిని పాలుతాగి కాసేపు ఆదమరిచి
నువ్వలా నిద్రకి మళ్ళినపుడు
వేల పావురాళ్ళు నీ ఉయ్యాల చుట్టూత వాలిన
దృశ్యం కనిపిస్తుంది
ఒక శాంతిగీతం వినిపిస్తుంది–
మా హృదయాలు పరిమళించాయి ..
నీ రాకతో
జీవితంలో ఖాళీ పూరించబడింది
ఇల్లు తేజోవంతమైంది –

